ప్రజా సంక్షేమం పట్టని పరిటాల

● ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: '25 ఏళ్ల పరిటాల కుటుంబ పరిపాలనలో నియోజకవర్గంలో ఏ ఒక్కరికీ మంచి జరగలేదు. ప్రాజెక్టుల పేరుతో దోచుకున్నారు. వందల ఎకరాలు పోగు చేసుకున్నారు. ఎంతసేపూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆస్తులు పెంచుకోవాలనే ఆలోచన తప్ప ప్రజల గురించి పట్టించుకోలేదు. పరిటాల కుటుంబం ప్రజలకు, టీడీపీ కార్యకర్తలకు చేసిందేమీ లేదు' అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ వ్యాప్తంగా సచివాలయ జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, ఇతర ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ నేడు అభివృద్ధి దిశగా కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చి మాటపై నిలబడిన నాయకుడిగా జగనన్న నిలిచారన్నారు. నేడు భారతదేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వ్యవసాయ ఉత్పాదకత గణనీయంగా పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు గతం కంటే మెరుగయ్యాయని పేర్కొన్నారు. జగన్ హయాంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ దేశంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న 5వ రాష్ట్రంగా ఎదిగిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి ర్యాంకు సాధించిందన్నారు. 2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వంలో రుణభారం 169 శాతం పెరిగితే, 2019 తర్వాత కోవిడ్ మహమ్మారి ప్రభావంలోనూ జగన్ ప్రభుత్వం దానిని 58 శాతానికి తగ్గించిందన్నారు.

21 నుంచి 31 వరకూ ప్రతి గడపకూ వెళ్లాలి

ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అధికారులతో కలిసి ప్రతి గడపకూ వెళ్లాలన్నారు. మనం చేసిన అభివృద్ధిని వివరించి ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. నియోజకవర్గంలోనూ నిత్యం హత్యలు, దౌర్జన్యాలు, దోపిడీలు, అరాచకాలను గమనిస్తూ వచ్చారన్నారు. 2014లో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేస్తే 2016 నుంచి వారి ప్రభుత్వాన్ని గద్దె దించాలని అన్ని వర్గాల ప్రజలు నిర్ణయించుకున్నారు. ఈ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న మనం ఏ చిన్న పోరాటం చేసినా పెద్ద ఎత్తున ప్రజల మద్దతు లభించిందన్నారు. వారి అరాచక పాలనకు 2019లో చరమగీతం పాడారన్నారు. చంద్రబాబు హయాంలో బడా కాంట్రాక్టర్లు, పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీలు బాగుపడితే.. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత పేదలు అభివృద్ధి చెందారుని, ప్రతి కుటుంబం బాగు పడిందన్నారు. సమావేశంలో రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, నియోజవకర్గంలోని అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ కన్వీనర్లు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 32వ వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మట్టి రహదారులతో ఇబ్బందులు పడుతున్నామని సిమెంట్ రోడ్లు వేయించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కాలువలు, రోడ్లు వేయాలని మహిళలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇంటిపట్టా మంజూరైనా బిల్లులు పడలేదని పలువురు, ఇంటిపట్టా ఇచ్చినా పునాది వేసేందుకు వెళితే తుంపర్తి ప్రాంతంలో తోటకు అడ్డం వస్తుందంటూ యజమాని గొడవపడుతున్నాడని మరొకరు విన్నవించారు. ఏఎస్ఐ డోనాసింగ్‌ను పిలిచి తోట యజమానితో మాట్లాడి పునాది కట్టేందుకు అడ్డురాకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రహదారిలో సెప్టిక్ ట్యాంకు నిర్మించి పైపులు వేస్తే ఎలాగని ఎమ్మెల్యే సచివాలయ ఉద్యోగులను ప్రశ్నించారు. ప్లానింగ్ సెక్రటరీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వార్డులో వేస్తున్న తాగునీటి పైపులైన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, వార్డు కౌన్సిలర్ చిల్లా శారద, వార్డు ఇన్‌చార్జ్ చిల్లా భాస్కర్ రెడ్డి, సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హనుమ క్షేత్రాలకు బస్సులు



కదిరి అర్బన్: హనుమాన్ దర్శనానికి కదిరి డిపో నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు డీఎం మైనోద్దీన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 12 వరకు నేమకల్లు, కసాపురం, మురడి పుణ్యక్షేత్రాలను ఒకేసారి దర్శించుకునేందుకు పెద్దలకు టికెట్ రూ.750, పిల్లలకు రూ.410 వసూలు చేస్తారని పేర్కొన్నారు. శనివారాల్లో కదిరి బస్టాండ్ నుంచి బయలుదేరుతాయన్నారు. పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయానికి 10 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు 9959225892 సెల్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ధర్మవరం నుంచి..

ధర్మవరం అర్బన్: ధర్మవరం బస్‌స్టాండ్ నుంచి కూడా ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ డీఎం మోతిలాల్‌నాయక్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎం మాట్లాడుతూ ప్రతి మంగళవారం, శనివారం ఒకేరోజు మురడి, నేమకల్లు, కసాపురం ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకునేందుకు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. పెద్దలకు రూ.600, పిల్లలకు రూ.300 ధర నిర్ణయించామన్నారు. ఆగస్టులో 19,22,26,29, సెప్టెంబర్‌లో 2,5,9,12 తేదీలలో బస్సులు ఏర్పాటు చేశామన్నారు. బుకింగ్ కోసం 7382860947 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సోమేశ్వర్


యోగా అసోసియేషన్ నూతన కమిటీ

ధర్మవరం అర్బన్: యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ధర్మవరం పట్టణానికి చెందిన గాజుల సోమేశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాలో యోగా పోటీలను నిర్వహిస్తామన్నారు. పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు యోగ పట్ల అవగాహన కల్పిస్తామని తెలిపారు.

భర్తపై వరకట్న వేధింపుల కేసు

కదిరి అర్బన్: తన భర్త మహ్మద్ రఫీక్ వరకట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నాడని మండల పరిధిలోని కాళసముద్రం గ్రామానికి కౌసర్ అనే మహిళ రూరల్ మండల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ సూర్య నారాయణ తెలిపారు.

అధిక సంఖ్యలో కేసులు రాజీ చేయాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి జయలక్ష్మి

కదిరి టౌన్: అధిక సంఖ్యలో కేసులు రాజీ చేయాలని కదిరి సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి తెలిపారు. కోర్టులో బుధవారం పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, లోక్ అదాలత్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9వ తేదిన లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అడిషనల్ జీఎఫ్‌సీ ఎం.మీనాక్షి సుందరి, ఏపీపీ సాయి కృష్ణ, సీఐ మధు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ముదిగుబ్బ: జొన్నలకొత్తపల్లి వద్ద బుధవారం లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న కారును ద్విచక్ర వాహనం ఢీకొంది. ఒలిమిచెర్లోపల్లి గ్రామానికి చెందిన గంగాధర్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

పారిశుధ్య నిర్వహణ మెరుగుపడాలి


పాలకమండలి సమావేశంలో సమస్యలు వివరిస్తున్న కౌన్సిలర్లు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తిలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపడాలని కౌన్సిలర్లు సూచించారు. బుధవారం స్థానిక కౌన్సిల్ హాలులో చైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయినట్లు చెప్పారు. విదేశాల నుంచి భక్తులు వస్తున్న నేపథ్యంలో పాలకులు, ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడాలన్నారు. మెయిన్ రోడ్డుపై చెత్తకుండీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పందుల స్వైర విహారంతో రోగాలు ప్రబలుతున్నాయని, పుట్టపర్తికి చెందిన ఓ చిన్నారి డెంగీతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్డుల వారీగా పనులను పూర్తి చేయాలన్నారు. ప్రతి వార్డుకు ముగ్గురు చొప్పున కార్మికులను కేటాయించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. బిల్లులు త్వరితగతిన చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కౌన్సిలర్ల సమస్యలపై కమిషనర్ మధుసూదన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు మాతంగి తిప్పన్న, మరుట్ల శ్రీలక్ష్మి, కౌన్సిలర్లు చెరువు భాస్కర్‌రెడ్డి, సాయిగీత, సూర్యాగౌడ్, సాయిలీల, అనిత, సరస్వతి, కవిత, లక్ష్మీదేవమ్మ, పరుశురాంనాయక్, ఈశ్వరమ్మ, కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ రఫీ, ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, తదితరులున్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు


తాడిమర్రిలో టీకాలు వేస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని సచివాలయాల్లో బుధవారం వైద్య సిబ్బంది చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేశారు. తాడిమర్రి, కునుకుంట్ల, పెద్దకోట్ల, దాడితోట, చిల్లవారిపల్లి, పిన్నదరి, నార్సింపల్లి, ఎం.అగ్రహారం, చిన్నచిగుళ్లరేవు గ్రామాల్లోని సచివాలయాల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఐదేళ్ల వయసులోపు చిన్నారులకు డీపీటీ, పెంటా, హెపటైటిస్ బీ తదితర టీకాలను వేశారు. చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం వైద్య సిబ్బంది మహిళలకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఆరు నెలల లోపు చిన్నారులకు అమ్మపాలు మాత్రమే తాపాలన్నారు. ఆరు నెలల తర్వాత ఉడికించిన కందిపప్పు, కూరగాయలు, నెయ్యితో కలిపిన అన్నం తినిపించాలని వారు సూచించారు. అలాగే ఉదయం, సాయంత్రం రెండు పూటలా స్నానం చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు కృష్ణమ్మ, లక్ష్మీకాంతమ్మ, భవాణి, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్, జానకీరామ్, వెంకట్రాముడు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రామేశ్వరానందస్వామి శివైక్యం


రామేశ్వరానంద స్వామి (ఫైల్)


రామేశ్వరానందస్వామి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

బత్తలపల్లి: మండలంలోని సంఘమేశ్వర క్షేత్రం అభివృద్ధికి పాటుపడిన రామేశ్వరానంద స్వామీజీ(85) శివైక్యం పొందారు. మంగళవారం రాత్రి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు. నెల్లూరు జిల్లాకు చెందిన జయరాం రెడ్డిస్వామి (రామేశ్వరానంద స్వామిజీ) 50 సంవత్సరాలకు పైగా మండలంలోని అప్పరాచెరువు సమీపాన గల ప్రముఖ పుణ్యక్షేత్రం సంఘమేశ్వర క్షేత్రంలో విడిది చేశారు. షిర్డీసాయి మందిరం, వెంకటేశ్వర ఆలయం తదితర ఆలయాలు నిర్మించి క్షేత్ర అభివృద్ధికి పాటు పడ్డారు. కొన్ని రోజులుగా వృద్ధాప్యం, అనారోగ్యంతో బాధపడుతుండగా కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. సంఘమేశ్వర క్షేత్రంలో ముందస్తుగా ఆయనే స్వయంగా నిర్మించుకున్న సమాధిలో అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి స్వామి మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ బగ్గిరి త్రివేణి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి, అప్పరాచెరువు సర్పంచు మొర్రెడ్డిగారి శారదమ్మ, సంగాల సర్పంచు కంచనగారి రాజశేఖర్‌రెడ్డి, చెన్నరాయపట్నం లింగమయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

కుటుంబ ఓట్లన్నీ ఒకే చోట ఉంచాలి

బత్తలపల్లి: ఒక కుటుంబానికి చెందిన ఓటర్లు అందరినీ ఒకే బూత్ పరిధిలోకి చేర్చాలని బీఎల్‌ఓలకు తహసీల్దార్ యుగేశ్వరీదేవి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో జరుగుతున్న ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాలలో ప్రతి ఇంటికి బీఎల్‌ఓలు వెళ్లి ఆ ఇంట్లోని ఓటర్ల వివరాలను జాబితాలో సరిచూస్తారని తెలిపారు. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బీఎల్‌ఓలు రానా ప్రతాప్, నరసింహ, రాజా, హరిప్రియ, హసీన్ బీ, వీఆర్‌ఓలు ప్రతాప్, రవికాంత్‌రెడ్డి, భరద్వాజ్‌బాబు ఉన్నారు.

నిరాశ్రయులకు ఆర్డీటీ అండ

ధర్మవరం రూరల్: నిరాశ్రయులకు ఆర్డీటీ అండగా నిలుస్తోందని బత్తలపల్లి రీజనల్ డైరెక్టర్ ప్రమీల అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోతుకుంట ఆర్డీటీ పాఠశాలలో జీఎస్ఎస్ ద్వారా ఆహార వస్తువులను వృద్ధులకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన రీజనల్ డైరెక్టర్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడమే ఆర్డీటీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రీజనల్ ఇంజనీర్ మధుసూదన్, ఏటీఎల్ శ్రీనివాసులు, సీఓలు గురుస్వామి, చిత్రసేన, ప్రకాష్, జీఎస్ఎన్ గ్రామాల దాతలు గొట్లూరు లక్ష్మన్న, గోవిందప్ప, సీబీటీ మహేష్, సీడీసీలు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ప్రయోగాలు

ధర్మవరం రూరల్: ఖరీఫ్‌లో సాగు చేసిన వివిధ పంటలలో కోత ప్రయోగాలను పకడ్బందీగా చేపడదామని వ్యవసాయ శాఖ ఏడీ కృష్ణయ్య, డీవైఎస్ఓ గోపాల్ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిధిలోని పోతుకుంట రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పంటల్లో పంట కోత ప్రయోగాలు చేసే పద్ధతులు, పంట కోత ప్రయోగం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఎటువంటి తప్పిదాలకు చోటు లేకుండా పంట కోత ప్రయోగాలను చేపట్టాలని వారు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ముస్తఫా, ఏఎస్ఓ రామక్రిష్ణ, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం


చెన్నేకొత్తపల్లి: అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం


కనగానపల్లి: రాంనాగేష్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కనగానపల్లి: ఎంఈఓ కార్యాలయంలో మెసెంజర్‌గా పని చేస్తూ ఉత్తమ సేవా అవార్డు పొందిన రాం నాగేష్‌ను బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సన్మానించారు. ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవి పూలమాలలు, శాలవాలు వేసి అభినందించారు. అలాగే ఉత్తమ సంక్షేమ అధికారిగా అవార్డు పొందిన హాస్టల్ వార్డెన్ వెంకటేష్‌కు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ రామన్న, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మేడాపురం జెడ్పీహెచ్ఎస్ స్కూల్ సీఆర్‌పీ వెంకటేష్, కనుముక్కల జెడ్పీహెచ్ఎస్ పీటీఐ పవన్ కుమార్, చెన్నేకొత్తపల్లి ఎంఆర్‌సీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న శివారెడ్డి ఉత్తమ సేవా అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. బుధవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ-1 మున్వర్‌బాషా, ఎంఈఓ-2 ప్రసన్న కుమార్ నాయుడు తదితరులు అవార్డులు స్వీకరించిన వారిని సన్మానించారు. ఎమ్మార్సీ సిబ్బంది రామసుబ్బారెడ్డి, సీఆర్పీ శివయ్య ఉన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట

ప్రశాంతి నిలయం: వైఎస్ జగన్ ప్రభుత్వం వసతి గృహ విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి అన్నారు. పుట్టపర్తిలోని ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థులకు బుధవారం రాత్రి దుప్పట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వసతి గృహ విద్యార్థుల కోసం కొత్త మెనూ అమలు చేస్తోందన్నారు. షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారిత అధికారిత అధికారి శివరంగ ప్రసాద్, వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, కౌన్సిలర్లు సాయిగీత,చెరువు భాస్కర్‌రెడ్డి నాయకులు ఫోటో సాయి,రామయ్య, బాబు భవన్, వార్డెన్ కవితా తదితరులున్నారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

కదిరి టౌన్: కదిరి అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 9 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ తమ్మిశెట్టి మధు తెలిపారు. 5 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రూ. 2 వేలు డిపాజిట్ కట్టి పాల్గొనాలని సూచించారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలి

కనగానపల్లి: వ్యవసాయ బోర్లకు సరఫరా అవుతున్న విద్యుత్ లోఓల్టేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని దాదులూరు గ్రామ రైతులు కోరారు. బుధవారం మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. రైతులు ప్రభాకర్, కేశవ, నరసింహులు, చంద్రమౌళి, లక్ష్మిపతి ఉన్నారు.

పంట నమోదు పరిశీలన

నల్లచెరువు: పంతులచెరువు గ్రామంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని ఏఓ భారతి బుధవారం పరిశీలించారు. రైతులు తమ పంటను తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో వీఏఓ జహీర్ పాల్గొన్నారు.

రేషన్ షెడ్డుకు నిప్పు.. రూ. లక్ష నష్టం

అమడగూరు: ఓడీచెరువు మండలం ఇనగలూరు గ్రామానికి చెందిన డీలర్ క్రిష్టారెడ్డి రేషం షెడ్‌కు నిప్పు అంటుకుని రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నారు. బుధవారం షెడ్ చుట్టు పక్కల శుభ్రం చేస్తున్న సమయంలో అగ్గిరవ్వలు షెడ్‌పై పడి కాళి కప్పడం, సిమెంట్ రేకులు పగిలిపోయి నట్లు పేర్కొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ధర్మవరం డివిజన్

9912220727, 9912220726, 9010593486

సంక్షిప్త సమాచారం

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

తనకల్లు: స్థానిక చౌడేశ్వరీ ఆలయంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ తోపు పారేసు ఆధ్వర్యంలో బుధవారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, బీసీ సెల్ మండల అధ్యక్షులు నరసింహులు, సోమశేఖర్, నాయకులు మస్తాన్‌బాబు, రమప్ప, నరసింహులు, కన్నయ్య, డీ. నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

29న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఈనెల 29న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అనంతపురంలోని తన స్వగృహంలో విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్లను సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విగ్రహావిష్కరణకు రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీ గోరంట్ల మాధవ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

పార్సిల్ ఇంత లేటా అన్నందుకు రాడ్‌తో దాడి

కదిరి టౌన్: అనంతపురానికి చెందిన మజీద్ అహమ్మద్ బుధవారం కదిరిలో తన మామ ఇంతియాజ్ ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం స్థానిక మదనపల్లి రోడ్డులో ఉన్న అరబిక్ హోటల్‌కు వెళ్లిన అహమ్మద్ ఆర్డర్ ఇచ్చి పార్సిల్ కట్టమన్నాడు. అరగంట అయినా ఇవ్వకపోవడంతో ఇంత లేటా అని ప్రశ్నించాడు. దీంతో కోపోద్రిక్తులైన హోటల్‌లో పనిచేసే ఇంతియాజ్, అల్తాఫ్, అతిక్, దాదాపీర్ కలిసి అతడిపై ఇనుపరాడ్డుతో దాడి చేశారు. పక్కనే ఉన్న ముజాహిద్ అడ్డు పడగా.. అతనిపై కూడా దాడి చేశారు. ఇరువురికి రక్త గాయాలు కావడంతో కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీనిపై అహమ్మద్ మామ ఇంతియాజ్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష

తలుపుల: ఉడమలకుర్తి పంచాయతీలోని 4వ వార్డుకు ఈ నెల 19 వ తేదీ నిర్వహించనున్న ఎన్నికల ప్రక్రియపై బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్ఓ శకుంతల సమీక్ష నిర్వహించారు. అధికారులకు నాయకులు సహకరించాలని కోరారు.

విద్యా సామగ్రి పంపిణీ

నల్లమాడ: కొండ్రవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఖిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పలకలు, నోటు పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. పుట్టపర్తికి చెందిన ఫైరోజ్, భాను పుట్టినరోజు సందర్భంగా పంపిణీ చేసినట్లు నిర్వాహకులు ఫారూక్ తెలిపారు.

22న మండల మీట్

అమడగూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మునెప్ప తెలియజేశారు. సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

నల్లమాడ: చెరువువాండ్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త వై.నీలకంఠారెడ్డి (42) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయి నాయక్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ, యూత్ విభాగం మండల అధ్యక్షులు కోనపల్లి నరసింహారెడ్డి, నాయకులు కొక్కంటి సాంబశివారెడ్డి, ఎం.సుధాకర్‌రెడ్డి, మాయకుంట్ల క్రిష్టారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, స్థానికులు మల్లికార్జునరెడ్డి తదితరులు నీలకంఠారెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ యూత్ విభాగం మండల అధ్యక్షులు కోనపల్లి నరసింహారెడ్డి, దీప దంపతులు మృతుని కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు.

దివ్యాంగుల చట్టాలపై అవగాహన అవసరం

ప్రశాంతి నిలయం: దివ్యాంగుల చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి దివ్యాంగుల చట్టాలను వివరించే పుస్తకాన్ని ఎస్పీ మాధవరెడ్డికి అందజేశారు.

